కశ్మీర్ పాకిస్థాన్‌లో ఉందా?

బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి విమర్శ

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తన ఎక్స్ ఖాతాలో కశ్మీర్ పాకిస్థాన్‌లో ఉన్నట్టు చూపెట్టడం దురదృష్టకరమని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఒక ఎమ్మెల్యేకు దేశ పటంపై కనీస అవగాహన లేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సోషల్ స్టడీస్‌లో స్పెషల్ కోచింగ్ ఇవ్వాలని సూచించారు. రాజకీయాల్లో ఉన్నవారికి కేవలం డబ్బులు ఉంటే సరిపోదని, దేశం పట్ల బాధ్యత, నడవడికలో పరిణతి కూడా ఉండాలని సూచించారు.

విద్యా శాఖ మంత్రిని నియమించాలి

- **బీఆర్ఎస్ నేత ఏనుగు భరత్**

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని బీఆర్ఎస్ నాయకుడు ఏనుగు భరత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదాయాన్ని మాత్రమే పొందాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఎక్సైజ్ శాఖ మంత్రిని నియమించిందని, కానీ ఆరు నెలలు గడుస్తున్నా ముఖ్యమైన విద్యా రంగంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఒక ప్రకటనలో మండిపడ్డారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించిన రెండు లక్షల ఉద్యోగాల జాబ్ క్యాలెండర్ ఏమైందని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రతిపక్షంలో ఉండగా గ్రూప్-1 ప్రిలిమ్స్ నిష్పత్తి 1:100 ప్రకారం ఇవ్వాలని కోరిన కాంగ్రెస్, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఆ నిష్పత్తిని అమలు చేయకపోవడం దుర్మార్గం అని మండిపడ్డారు. జీవో 46 ను సవరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రజాపాలన కాదని, దగాపాలన అని ధ్వజమెత్తారు.

అక్రమ కేసులతో లొంగదీసే కుట్ర

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే టార్గెట్‌గా ఈడీ, ఐటీ

- ప్రతిపక్ష ఎమ్మెల్యేల కదలికలపై కాంగ్రెస్ నిఘా
- నీట్ పేపర్ లీక్‌పై స్పందించని కేంద్రం
- 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలు
- నీట్ పేపర్ లీక్‌చేసిన వారిపై ఈడీ, ఐటీ దాడులు ఎందుకు జరుపరు?
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఫైర్
- పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కుటుంబసభ్యులకు భరోసా

మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్‌రెడ్డి, చింతా ప్రభాకర్, మాణిక్ రావు, మాజీ ఎమ్మెల్యే చంటిక్రాంతి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఒంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు

సంగారెడ్డి, జూన్ 21(నమస్తే తెలంగాణ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను టార్గెట్ చేసి వేధిస్తున్నాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను లొంగదీసుకునేందుకు ఈడీ, ఐటీ దాడులు, అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కదలికలపై ఇంటెలిజెన్స్ ద్వారా మానిటరింగ్ చేస్తున్నదని, ఫోన్లపై నిఘా పెట్టిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకునేందుకు కాంగ్రెస్ కుట్రలు పన్నుతున్నదని మండిపడ్డారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డి నివాసాల్లో ఈడీ సోదాలు చేసిన నేపథ్యంలో హరీశ్‌రావు శుక్రవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరుకు వచ్చారు. మహిపాల్‌రెడ్డి సోదరులకు ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని, అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. మహిపాల్‌రెడ్డి ఈడీ అధికారులకు సంపూర్ణంగా సహకరించారని తెలిపారు. ఈడీ అధికారులు అణువణువు వెతికినా మహిపాల్‌రెడ్డి ఇంట్లో ఏమీ దొరక లేదని చెప్పారు. మహిపాల్‌రెడ్డి కుటుంబసభ్యులు ఐటీ రిటర్న్స్ సమర్పిస్తూ బాజాప్తా ఆర్థిక లావాదేవీలు చేస్తున్నారు తప్ప ఎక్కడా తప్పు చేయలేదని పేర్కొన్నారు. అయినా ఈడీ దాడులు దురదృష్టకరమని పేర్కొన్నారు. కేవలం ప్రతిపక్ష నాయకులపైనే ఈడీ, ఐటీ దాడులు జరుగుతున్నాయని దుయ్యబట్టారు. ఈడీ అధికారులు సోదాల సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కుటుంబసభ్యులతోపాటు చిన్నారులను కూడా ఇబ్బందిపెట్టడం, వారిని అమ్మానాన్న, తాతయ్య వద్దకు వెళ్లకుండా అడ్డుకోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు.

నీట్ పేపర్ లీక్‌తో అంధకారం

నీట్ పరీక్షా పత్రం లీక్ కావడంతో దేశంలో 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారిందని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. మన రాష్ట్రం నుంచి లక్ష మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాశారని, వారు తమ భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్నారని చెప్పారు. నీట్ ప్రశ్నపత్రం రూ.30 లక్షలకు అమ్ముడుపోయిన బీహార్‌లో ఈడీ దాడులు ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. 24 లక్షల మంది విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతుంటే కేంద్రం ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. ప్రశ్నాపత్రం లీక్ చేసిన అధికారులు, పరీక్ష పెట్టిన ఎన్టీఏపై ఈడీ, ఐటీ దాడులు ఎందుకు చేయడంలేదని ప్రశ్నించారు.

ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై నిఘా

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులను టార్గెట్ చేస్తున్నదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేల కదలికలను ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్ ద్వారా, ఫోన్‌ల ద్వారా మానిటర్ చేస్తున్నారని ఆరోపించారు. ఏదో రకంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు వినకపోతే అక్రమ కేసులు పెట్టడం, భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు కుటుంబసభ్యులను సైతం కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బంది పెడుతున్నదని మండిపడ్డారు. దక్కిన అధికారంతో ప్రజలకు మేలు చేయకుండా ప్రతిపక్షాన్ని బలహీనపర్చే పనిలో కాంగ్రెస్ నిమగ్నమైందని విమర్శించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు వినకపోతే కేసులు పెట్టే ప్రయత్నం జరుగుతున్నదని ఆరోపించారు. తమకు న్యాయవ్యవస్థ మీద నమ్మకం ఉన్నదని, అంతిమంగా న్యాయం గెలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్ రావు, మాజీ ఎమ్మెల్యేలు చంటి క్రాంతికిరణ్, మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, సీనియర్ నాయకులు ప్రతాప్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్‌లో రూ.300 కోట్ల అక్రమాలు

- **ఎమ్మెల్యేపై ఈడీ సంచలన ఆరోపణ**
- **రూ.19 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు ప్రకటన**

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ) : మైనింగ్ పేరుతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అక్రమాలకు పాల్పడ్డారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సంచలన ఆరోపణలు చేసింది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఉన్న ఎమ్మెల్యే, ఆయన తమ్ముడు మధుసూదన్‌రెడ్డి ఇండ్లు, ఆఫీసులపై మనీ లాండరింగ్, హవాలా అనుమానాల నేపథ్యంలో ఈడీ సోదాలు జరిపిన విషయం విదితమే. మైనింగ్ పేరుతో రూ.300 కోట్ల మేర అక్రమాలు జరిగాయని, ప్రభుత్వానికి రూ.39 కోట్లు నష్టం చేకూర్చారని ఈడీ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్యాంక్ అకౌంట్లలో అక్రమ లావాదేవీలను గుర్తించామని, అక్రమ మార్గంలో కూడబెట్టిన డబ్బుతో రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెట్టారని తెలిపారు. సోదాల సందర్భంగా రూ.19 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. బినామీల పేర్లతో లావాదేవీలను గుర్తించామని, కొన్ని బ్యాంక్ లాకర్స్‌ని తెరవాల్సి ఉందని తెలిపింది. పెద్ద సంఖ్యలో ఆస్తి పత్రాలు, లెక్కల్లో చూపని నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నగదుకు సంబంధించిన ఆధారాలు ఉన్న మొబైల్ ఫోన్లను సీజ్ చేశామన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్. చిత్రంలో బీరం, బాలరాజు, అభిలాష్‌రావు

సీఎం రేవంత్ రాజీనామా చేయాలి

- లేకుంటే కాంగ్రెస్ అధిష్ఠానం తొలగించాలి
- రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు
- చెంచు మహిళ కిడ్నాప్, లైంగికదాడే నిదర్శనం
- వైఫల్యానికి హోంమంత్రిగా ఆయనదే బాధ్యత
- బీఆర్ఎస్ పార్టీ నేత ఆర్ఎస్ ప్రవీణ్

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, దీనికి హోంశాఖను నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఒకవేళ ఆయన చేయకుంటే కాంగ్రెస్ అధిష్ఠానం రేవంత్‌రెడ్డిని పదవి నుంచి తొలగించాలని కోరారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి వైఫల్యంతోనే శాంతి భద్రతలు క్షీణించాయని విమర్శించారు. రాష్ట్రంలో ఎన్నో అరాచకాలు, అఘాయిత్యాలు జరుగుతున్నా హోంశాఖపై ఒక్కసారి కూడా సమీక్షించలేదని తెలిపారు. హోం, విద్య శాఖలకు రాష్ట్రంలో ప్రత్యేక మంత్రులు లేరని, ఈ రెండూ సీఎం తన వద్దే ఉంచుకున్నారని, ఇలాంటి కీలక శాఖలకు ప్రత్యేకంగా మంత్రులు లేకుండా ఏ రాష్ట్రమూ లేదని తెలిపారు. రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి వల్లకాడు చేయాలని అనుకుంటున్నారా? అంటూ ప్రశ్నించారు. ఒక చెంచు మహిళను కిడ్నాప్ చేసి వారంపాటు ఆమెపై లైంగికదాడి చేశారని, పోలీసుస్టేషన్‌లో మరో మహిళ ఆత్మహత్య చేసుకున్నదని రాష్ట్రంలో శాంతిభద్రతల దిగజారిందనడానికి ఇవే నిదర్శనాలని తెలిపారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో శ్రీధర్‌రెడ్డి హత్య జరిగి 40 రోజులు అవుతున్నా దోషులను పట్టుకోలేదని, ఇంత మంది పోలీసులు ఏం చేస్తున్నట్టు అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో 24 గంటల్లో ఐదు హత్యలు జరిగాయని, మెదక్‌లో మత కల్లోలాలు జరిగినా పోలీసులు చోద్యం చూస్తున్నారని ధ్వజమెత్తారు. సుల్తానాబాద్‌లో చిన్నారిపై లైంగిక దాడి జరిగిందని, కడ్తాల్ సమీపంలో రెండు హత్యలు జరిగాయని తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతల వైఫల్యం కొటొచ్చినట్టు కనిపిస్తున్నా, పోలీసులు సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై కేసులు పెట్టడంలో బిజీ గా ఉన్నారని విమర్శించారు. నాగర్‌కర్నూల్ డీఎస్పీని తక్షణమే విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో పోలీస్ వ్యవస్థ పటిష్ఠంగా ఉన్నదని తెలిపారు.

పరిహారం చెల్లించాలి: బీరం, బాలరాజు

కిడ్నాప్ అయి లైంగికదాడికి గురైన చెంచు మహిళకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యేలు బీరం హర్షవర్ధన్‌రెడ్డి, బాలరాజు డిమాండ్ చేశారు. మరో ఘటనలో కొల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లోనే మహిళ విషం తీసుకుని చనిపోగా, పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాలు పనిచేయడం లేదనడం ఆశ్చర్యంగా ఉన్నదని, దీనికి బాధ్యులైన పోలీసులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో శాంతభద్రతలు క్షీణిస్తుంటే, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి రాజకీయాలపైనే ఉన్నదని ఎద్దేవా చేశారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకుంటున్న సీఎం ఇదే జిల్లాలో అవాంఛనీయ ఘటనలు జరుగుతున్నా చోద్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రాన్ని గూండారాజ్యంగా మార్చాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

జూలై 5 వరకు ఎమ్మెల్సీ కవిత కస్టడీ

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం విధానం కేసులో రిమాండ్‌లో ఉన్న ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని మరోసారి పొడిగించారు. జూలై 5 వరకు ఆమె కస్టడీని పొడిగిస్తూ రౌస్ ఎవెన్యూ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. అధికారులు శుక్రవారం ఆమెను వర్చువల్‌గా కోర్టు ముందు హాజరుపరిచారు. ఈ కేసును జూలై 3వ తేదీన రౌస్ ఎవెన్యూ కోర్టు మరోమారు విచారణ జరుపనున్నది. గతంలో సీబీఐ నమోదు చేసిన కేసులో కోర్టు ఈ నెల 21 వరకు కస్టడీని పొడిగించింది. కాగా, కవిత బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

కాంగ్రెస్‌లోకి పోచారం

- ఇంటికెళ్లి ఆహ్వానించిన సీఎం రేవంత్, పొంగులేటి
- ప్రభుత్వ విధానాలు నచ్చి చేరా : పోచారం

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ స్పీకర్, ప్రస్తుత బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆయన కొడుకు భాస్కర్‌రెడ్డి శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని పోచారం ఇంటికి వెళ్లి ఆహ్వానించి ఇద్దరికీ కాంగ్రెస్ కండువా కప్పారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిశామని, తమ ప్రభుత్వానికి పెద్దలు అండగా ఉండాలని కోరిన వెంటనే ఆయన కాంగ్రెస్‌లో చేరారని తెలిపారు. రైతుల సంక్షేమంపై పోచారం నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు. భవిష్యత్తులో పోచారం శ్రీనివాస్‌రెడ్డికి సముచిత గౌరవం కల్పిస్తామన్నారు. నిజామాబాద్ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఆయన సహకారం తీసుకుంటామన్నారు.

రేవంత్ కృషి భేష్ : శ్రీనివాస్‌రెడ్డి

రైతు సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ, రైతు విధానాలు నచ్చి కాంగ్రెస్‌లో చేరానని పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తన రాజకీయ ప్రస్థానం కాంగ్రెస్ నుంచే మొదలైందన్నారు.

ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

మొదటిపేజీ తరువాయి...

దుయ్యబట్టారు. పోచారం రాజీనామా చేస్తే తానే ఆయనపై పోటీ చేస్తానని ప్రకటించారు. తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్, బీఆర్ఎస్ నేత అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి బాజిరెడ్డి శుక్రవారం మీడియా సమావేశం మాట్లాడారు. రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి చేస్తున్న మేలును దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు పోచారం చెప్పడం ఆత్మవంచనే అని, రైతులకు ద్రోహం చేస్తున్న రేవంత్ రెడ్డి తీరును పోచారం ఎందుకు మరచిపోయారోనని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బాన్సువాడ ప్రచారంలో పోచారం కుటుంబాన్ని రేవంత్ దండుపాళ్యం బ్యాచ్‌తో పోల్చారని, ఆయన నాయకత్వంలోనే పార్టీ మారడం నిజంగా ఆశ్చర్యంగా ఉందన్నారు. కేసీఆర్ పోచారానికి స్పీకర్, మంత్రి పదవులిచ్చి గౌరవించారని గుర్తుచేశారు. పోచారం పార్టీ మారడం వల్ల బీఆర్ఎస్‌కు నష్టమేమి లేదని, కాంగ్రెస్‌కు కూడా లాభం ఉండదని చెప్పారు. ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాక రేవంత్‌రెడ్డి రాజకీయ వ్యభిచారం చేస్తున్నారని, ఆరు నెలల్లోనే రేవంత్‌పై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, ఓటుకు నోటు దొంగ రేవంత్ మళ్లీ అవే రాజకీయాలు మొదలు పెట్టారని, రేవంత్ ఆటలు ఇక సాగవని హెచ్చరించారు.

పోచారం పార్టీ మార్పు గర్హనీయం

- కేసీఆర్ ఎంతో గౌరవమిచ్చారు
- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ) : పోచారం శ్రీనివాస్‌రెడ్డి లాంటి పెద్ద మనిషి పార్టీ మారడం గర్హనీయమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. 2012లో ఆయన రాజీనామా చేసి తెలంగాణ కోసం పోటీ చేస్తే అందరం కలిసి గెలిపించుకున్నామని గుర్తుచేశారు. 2014లో తెలంగాణ మొదటి వ్యవసాయ శాఖ మంత్రిగా, 2018లో స్పీకర్‌గా ఆయనకు కేసీఆర్ అవకాశం ఇచ్చారని తెలిపారు. పోచారం అడిగిందే తడవుగా అన్ని పనులను ప్రభుత్వం ఆమోదించిందని, ముఖ్యమంత్రి నియోజకవర్గంలో కూడా కట్టనన్ని ఇండ్లు బాన్సువాడ నియోజకవర్గంలో కట్టేందుకు కేసీఆర్ అనుమతులిచ్చారని పేర్కొన్నారు. 2023 ఎన్నికల్లో ఆయన ఆరోగ్యం బాలేదని, పోటీ చేయనని చెప్పి ఆయనే పోటీ చేశారని, ఇప్పుడు ఏ నైతికతతో పోచారం పార్టీ మారుతున్నారో అర్థం కావడం లేదని, ఇలాంటివారితో తెలంగాణ సమాజం గందరగోళంలో పడుతుందని తెలిపారు. స్పీకర్, వ్యవసాయ మంత్రిగా కేసీఆర్ ఆయనకు ఎంతో గౌరవం ఇచ్చారని, ఆయన కుమారుడికి డీసీసీబీ చైర్మన్‌గా అవకాశం కల్పించారని గుర్తుచేశారు. లక్ష్మీపుత్రుడు అని ఆయనను బహిరంగ సభలు, అంతర్గత సమావేశాల్లో కేసీఆర్ పొగిడారని, ఇంతచేసినా కఠినంగా, నిర్దాక్షిణ్యంగా పోచారం ఎందుకు వ్యవహరించారో అర్థం కావడం లేదని పేర్కొన్నారు.

సీఎం ముందే పోచారంను నిలదీత

- కంగుతిన్న రేవంత్, పోచారం
- పార్టీ మారుతున్నారని ప్రచారం
- కలిసేందుకు వెళ్లిన గులాబీ నేతలు
- అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు
- పోలీసుల ప్రేక్షక పాత్ర

పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇంటి ఎదుట బీఆర్ఎస్ నేతలు, విద్యార్థి నాయకుల ఆందోళన

హైదరాబాద్/సిటీబ్యూరో/నాంపల్లి కోర్టులు, జూన్ 21 (నమస్తే తెలంగాణ): బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇంటి ఎదుట బీఆర్ఎస్ నేతలు, విద్యార్థి నాయకులు గర్జించారు. పోచారం కాంగ్రెస్‌లో చేరుతున్నారన్న సమాచారంతో ఆయన ఇంటికి వెళ్లారు. బీఆర్ఎస్‌ను ఎందుకు వీడాలనుకుంటున్నారని, కేసీఆర్ ఏం తక్కువ చేశారని శాంతియుతంగానే అడిగేందుకు వెళ్లిన గులాబీ సైనికులపై కాంగ్రెస్ నాయకులు విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. ఆ దాడులను ఆపాల్సిన పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడమే కాకుండా బీఆర్ఎస్, విద్యార్థి నేతలనే అరెస్టు చేశారు. దాడులకు పాల్పడిన కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయకుండా తమ ఎమ్మెల్యేను కలిసి మాట్లాడేందుకు వెళ్లిన విద్యార్థి నేతలనే అరెస్టు చేయడం దారుణమని, తక్షణమే వారిని విడుదల చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలు, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నేతలు నివాళులు అర్పించారు. ఆ సమయంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని, ఆయనను కలిసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి పోచారం ఇంటికే వెళ్లారని ప్రచారం మొదలైంది. తమ ఎమ్మెల్యేపై వస్తున్న ప్రచారం నేపథ్యంలో మర్యాదపూర్వకంగా కలుద్దామని బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యే కాలనీలోని పోచారం ఇంటికే బయలుదేరి వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, పార్టీ సీనియర్ నేత మన్నె గోవర్ధన్ రెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు ఆంజనేయగౌడ్, దూదిమెట్ల బాలరాజు, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, వాసుదేవరెడ్డి, ఓయూ విద్యార్థి నేతలు తుంగబాలు, కడారి స్వామియాదవ్, కే జంగయ్య, సీహెచ్ దర్శయ్య, పార్టీ నేతలు డీ రాజు, వరికుప్పల వాసు, రాజేశ్‌నాయక్ తదితరులు వెళ్లారు. అప్పటికే ఇంటి వద్ద పెద్దసంఖ్యలో కాంగ్రెస్ నేతలు మోహరించి ఉన్నారు. లోపల సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డితో భేటీ అయ్యారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ సహా ఇతర నాయకులు శాంతియుతంగా ఇంట్లోకి వెళ్లే ప్రయత్నం చేస్తుండగానే వారిని కాంగ్రెస్ నాయకులు అడ్డుకొని పోలీసుల ఎదుటే దాడికి దిగారు. 'మా ఎమ్మెల్యేను కలిసి మేం మాట్లాడకూడదా? వస్తే దాడులకు దిగుతారా? సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు' అని అరెస్టు అనంతరం బాల్క సుమన్ తెలిపారు.

గులాబీ నేతలపై కాంగ్రెస్ నేతల దాష్టీకం

బాల్క సుమన్ సహా ఇతర నేతలు పోచారం ఇంటి లోపలికి వెళ్లే ప్రయత్నం చేస్తుండగా 'మీకు ఇక్కడేం పని? ఎందుకొచ్చారా.. 'ఇంకా మీ ఎమ్మెల్యే ఏంరా?' అంటూ కాంగ్రెస్ నాయకులు తీవ్ర దుర్భాషలాడారు. ఈ సమయంలో ఇరుపక్షాల నడుమ తోపులాట, వాగ్వాదం చోటుచేసుకొని ఉద్రిక్తత నెలకొన్నది. బీఆర్ఎస్, విద్యార్థి నేతలపై కాంగ్రెస్ నాయకులు విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. ఇదే సమయంలో బాల్క సుమన్, దూదిమెట్ల బాలరాజు తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మిగితా విద్యార్థి నాయకులు పోలీసు వాహనానికి ముందు బైఠాయించారు. వారిని చెదరగొట్టారు. ఈ క్రమంలో మరో విద్యార్థి నాయకుడు రాజేశ్‌నాయక్ కాలికి తీవ్రగాయమైంది. బాల్క సుమన్ సహా 11 మంది బీఆర్ఎస్ పార్టీ, విద్యార్థి నాయకులను అరెస్టు చేసి కేసులు నమోదు చేశారు. ఆయా నేతలపై 353, 448 ఐపీసీ, రెడ్‌విత్ 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి 3వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరుపర్చారు. అయితే, వారి రిమాండ్‌కు నిరాకరించిన కోర్టు ..రూ.10 వేల చొప్పున ఇద్దరు జమానతుపై ఆ 11 మందికి బెయిల్ మంజూరు చేసింది. పోలీసుల విచారణకు సహకరించాల్సిందిగా వారిని ఆదేశించింది.

కేసీఆర్ మీకేం తక్కువ చేశారు?

- అధికారం లేకుంటే బతకలేరా?
- పోచారం పార్టీ మార్పుపై వేముల

వేల్పూర్, జూబ్లీహిల్స్ జూన్ 21: పోచారం శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరడాన్ని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. అధికారం, పదవులు లేకుంటే బతకలేమా? ఈ వయస్సులో పార్టీ మారడం మీకు భావ్యమా? అని ఓ ప్రకటనలో ప్రశ్నించారు. 'కేసీఆర్ మీకు ఏం తక్కువ చేశారు?. మిమ్మల్ని ఎప్పుడూ లక్ష్మీ పుత్రుడని సంబోధిస్తూ అధిక ప్రాధాన్యత ఇచ్చారు. పెద్దలు శ్రీనివాసరెడ్డి అంటూ ముందు వరుసలో ఆయన పక్కనే కూర్చోబెట్టుకున్నారు. మిమ్మల్ని మాకు ఆదర్శంగా చూపిస్తూ మీ గురించి గొప్పగా చెప్పేవారు. వ్యవసాయ మంత్రిగా, శాసనసభాపతిగా మీకు సమున్నత స్థానం కల్పించారు.సీఎం డెవలప్‌మెంట్ నిధుల నుంచి అత్యధికంగా తీసుకున్నది మీరే. నేను హౌసింగ్ మినిస్టర్‌గా ఉన్నా, నా కంటే ఎక్కువ మీరు అడిగినన్ని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు బాన్సువాడకు ఇచ్చారు. ఇదంతా కేవలం కేసీఆర్ మీకు ఇచ్చిన ప్రాధాన్యత వల్లే కదా?. మీరు అత్యంత ఇష్టదైవంగా భావించే తెలంగాణ తిరుమల గుడికి కూడా అడిగినన్ని నిధులిచ్చారు. ప్రాణం పోయే వరకు కేసీఆర్ వెంటే ఉంటానన్న మీరు, ఇప్పుడు ఆ తెలంగాణ తిరుమల శ్రీనివాసుడికి ఏం సమాధానం చెప్తారు' అని ప్రశ్నల వర్షం కురిపించారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిసేందుకే వెళ్లిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తోపాటు బీఆర్ఎస్ నేతలను ఎలా అరెస్టు చే